క్లుప్తంగా

గాయం బలరామిరెడ్డిని పరామర్శించిన దద్దాల



గాయం బలరామిరెడ్డిని పరామర్శిస్తున్న దద్దాల

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గొబ్బిళ్ల శ్రీను, సర్పంచ్ సైకం ఏడుకొండలరెడ్డి ఉన్నారు .

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు



నూతన విద్యుత్ స్తంభాన్ని నిలబెడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొండపి: విద్యుత్ స్తంభాన్ని మార్చకుండా రోడ్డు పక్కన పడేసిన వైనంపై 'ఎందుకింద నిర్లక్ష్యం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు పక్కన పడవేసి ఉన్న నూతన స్తంభాన్ని విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం పాత విద్యుత్ స్తంభం స్థానంలో అమర్చారు.

కుంట పోరంబోకు స్థలంలో సిమెంట్ రోడ్లా?



ఎంపీడీఓ రత్నజ్యోతికి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య

కందుకూరు రూరల్: మండలంలోని కొండికందుకూరు పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద కుంట పోరంబోకు స్థలంలో సిమెంట్ రోడ్లు ఎలా నిర్మిస్తారని సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య ఎంపీడీఓ పి.రత్నజ్యోతికి వినతిపత్రం ద్వారా తెలియజేశారు. కుంట పోరంబోకు స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని చట్టాలు, కోర్టుల తీర్పులు ఉన్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితిలో పోరంబోకు స్థలంలో రోడ్ల నిర్మాణం చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. దీనిపై పంచాయతీ తీర్మానం ఇవ్వాలని సర్పంచ్‌గా తనను.. కోరుతున్నామరని నిబంధనలకు విరుద్ధంగా తీర్మానాలు ఇవ్వలేని చెప్పారు. ప్రతిపాదించిన సిమెంట్ రోడ్లు కుంట పోరంబోకు కింద ఉందో లేదో మరో సారి పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. అలాగే శ్మశానం ప్రహరీ నిర్మాణం, లెవలింగ్, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు, పంచాయతీ పరిధిలోని చెరువులు, కుంటల్లో పూడికతీతల వంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రావెల రోడ్లను, చెరువును పంచాయతీ కుంటలును సర్వే చేయించి హద్దురాళ్లు వేయించాలన్నారు. ప్రతిపాదిత శ్మశాన, గ్రావెల్ రోడ్లు, చెరువు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని ఆరోపణలున్నాయని సర్వే చేసి అక్రమణలు తొలగించాలన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బుర్రా

కందుకూరు రూరల్: మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కొత్త వెంకట నరసారెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి–భార్గవిల వివాహం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు గణేశం గంగిరెడ్డి, వాకా శ్రీనివాసుల రెడ్డి, కృష్ణారెడ్డి, బిళ్లా రమణయ్య, గ్రామ నాయకులు తదతరులున్నారు.

'విశ్వమంగళం' షూటింగ్ ప్రారంభం

కందుకూరు: కందుకూరు మీడియా ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న విశ్వమంగళం సినిమా షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్‌తో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూజా కార్యక్రమాలు నిర్వహించి, తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. విశ్వమంగళం చిత్రంలో నటిస్తున్న నటీనటులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రం ద్వారా మంచి పేరు ప్రతిష్టలు రావాలని, చిత్ర నిర్మాణంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. సినీనటుడు ఫేమ్ అప్పారావు, చిత్ర దర్శకుడు సల్మాన్, చీదెళ్ల వేణు పాల్గొన్నారు.



నీళ్లు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్ సహాయంతో పాలేరు దాటుతున్న విద్యార్థులు



చిన్నపాటి వర్షానికే అధ్వానంగా ఉన్న కోటపాడు, కల్లూరివారిపాలెం రహదారి

నిత్యం నరకయాతనే..!

- అధ్వానంగా కల్లూరివారిపాలెం రహదారి
- సరైన రోడ్డు మార్గం లేక నిత్యం గ్రామస్తుల అవస్థలు
- విద్యార్థులకు సైతం తప్పని తిప్పలు
- బడికి పోవాలంటే పాలేరు దాటాల్సిన పరిస్థితి
- పాలేరులో నీళ్లు ప్రవహిస్తే బడి మానుకోవాల్సిందే
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పాలేరులో దిగి నీళ్లలో నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కోటపాడు(పొన్నలూరు):

మండంలోని కోటపాడు, కల్లూవారిపాలెం గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ గ్రామం ఓవీ రహదారికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్నా దశాబ్ద కాలంగా సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గ్రామస్తులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ రెండు గ్రామాల ప్రజలు ప్రతి పనికి, అవసరాలకు సమీపంలోని కె.అగ్రహారం సెంటర్‌కు వస్తుంటారు. అలాగే విద్యార్థులు కూడా తమ చదువుల నిమిత్తం కె.అగ్రహారం, చెరువుకొమ్ముపాలెం, పొన్నలూరు, కందుకూరు ప్రాంతాలకు రావాల్సి ఉంటుంది. అయితే ఈ రహదారిపై గుంతలు ఏర్పడి సక్రమంగా లేకపోగా గతంలో వేసిన గ్రావెల్‌రోడ్డే నేటికి దిక్కయింది. వాస్తవంగా వర్షం పడినప్పుడు ఈ రహదారిపై రాకపోకలు సాగించాలంటే గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా ముందుకు కదలలేనంత చిత్తడిగా మారి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పనుల నిమిత్తం ప్రజలు, పాఠశాలకు విద్యార్థులు గ్రామాల నుంచి బయటకు వెళ్లాలంటే పెద్ద సాహసం అవుతుంది. రోడ్డు మొత్తం బురదగా తయారై అడుగు తీసి ముందుకు వేయలేనంత చిత్తడిగా ఈ రహదారి ఉంటుంది.

బడికిపోవాలంటే పాలేరు దాటాల్సిందే...

కోటపాడు, కల్లూరివారిపాలెం గ్రామాలకు ప్రధానంగా ఒకటే రహదారి ఉంటుంది. ఈ రెండు గ్రామాల నుంచి సుమారుగా 50 మంది విద్యార్థులు ప్రతి రోజు ఆరు కిలోమీటర్ల దూరంలోని చెరువుకొమ్ముపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి ఆరు నుంచి పదవ తరగతి వరకు చదువుకుంటున్నారు. అయితే ఈ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్ సర్వీసు కూడా నామమాత్రంగా ఉంటుంది. దీంతో విద్యార్థులు ప్రతిరోజు స్థానికంగా ఉండే ఆటో మాట్లాడుకొని అందులో పాఠశాలకు వెళ్తుంటారు. ఈక్రమంలో మధ్యలో ఎప్పుడైన వర్షాలు పడినప్పుడు కోటపాడు, కల్లూరివారిపాలెం గ్రామాలకు సమీపంలో ఉన్న పాలేరులో నీళ్లు ప్రవహిస్తుంటాయి. ఇటువంటి సమయంలో రెండు గ్రామాల ప్రజలు పనులు నిమిత్తం, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాంటే ఈ పాలేరులో దిగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రెండు గ్రామాల ప్రధాన రహదారికి మధ్యలో పాలేరు ఉండటంతో వర్షాలు పడి నీళ్లు ప్రహించి ప్రజలు ప్రక్క గ్రామాలకు పోలేని పరిస్థితి నెలకొంటుంది. అ నేపథ్యంలో విద్యార్థులు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో బడి మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి వారి చదువులకు ఆటంకం కలుగుతుంది. రహదారి బురదమయం కావడంతో పాటు పాలేరులో నీళ్లు ప్రహిస్తుండటంతో వాహనాలు కూడా తిరిగే పరిస్థితి లేక విద్యార్థులు కూడా బడులు మానుకొని ఇంటి దగ్గరే ఉంటున్నారు. కొన్ని సార్లు విద్యార్థులు కూడా చేసేదేమి లేక తప్పనిసరి పరిస్థతుల్లో నీళ్లలోనే దిగి ఒకరినొకరు చేతులు పట్టుకొని నడుచుకుంటూ అవతలి ఒడ్డుకు చేరుకోని పాఠశాలకు వెళ్తున్నారు. ఇటువంటి సమయంలో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరుగుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వర్షాలు పడి పాలేరులో నీళ్లు ప్రవహిస్తున్నాయి. అయినా సరే నిత్యం పాఠశాల మానుకోలేక రెండు గ్రామాల విద్యార్థులు నీళ్లలోనే నడుచుకుంటూ పాలేరు దాటి పాఠశాలకు పోతున్నారు. ఒక్కొక్కసారి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే చేసేదేమి లేక విద్యార్థులు ట్రాక్టర్ సహాయంతో పాలేరును దాటుతుంటారు.

పట్టించుకోని అధికారులు...

దశాబ్దకాలంగా కోటపాడు, కల్లూరివారిపాలెం గ్రామాలకు చెందిన ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న నాథుడే లేడు. సంబంధిత అధికారులకు సైతం పరుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యం. రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే రహదారికి మధ్యలో ఉన్న పాలేరుపై వంతెన నిర్మాంచాలని కోరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఉన్న రహదారికి కనీసం గ్రావెల్ మట్టితోనైనా చదును చేసి మరమ్మతులు చేయాలని విన్నవించినా ఎవరు పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మర మ్మతులు చేయించి తమ కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి

కనిగిరిరూరల్ : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రభుత్వ, కస్తూర్బా, మోడల్ స్కూల్స్‌లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్, దిరసవంశ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కనిగిరి ప్రభుత్వ పాఠశాల, దిరిశవంచ పాఠశాలల్లో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశరావు పాల్గొన్నారు. అనంతరం తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దిరిస వంశ సర్పంచ్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు ఉడుముల నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, డీవీ సుబ్బారావు, జి. సంజీవ్, శ్రీనివాసరావు, సి.విజయభాస్కర్‌రెడ్డి, ఎంఎంఎస్ చైర్మన్ పందిటి మోహన్, హెచ్‌ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనిగిరి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో జరిగిన సమావేశ,లో మున్సిపల చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ విద్యార్థులతో ముచ్చటించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, దిల్షాద్ బేగం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

హనుమంతునిపాడు: మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓలు జి.పెద్దిరాజు, ఎస్ రమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. కేజీబీవీ ఎస్‌ఓ టి.అంజమ్మ, హెచ్‌ఎంలు బి.సుబ్బరావు, పద్మావతి, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, బ్రహ్మారెడ్డి, మీరావలి, సర్పంచ్‌లు, ఎంఎంస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామూరు: ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థులకు వరం వంటివని సీఐ ఎం భీమానాయక్, ఎంఈఓ గరి



డ్రగ్స్‌తో ప్రమాదం పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ

కపాటి కరుణకుమారి అన్నారు. మండలంలోన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. కేజీబీవీ విద్యాలయంలో ఎస్‌ఓ కటకం సజన, ఎస్సై టి.కిషోర్‌బాబు, ఎస్‌ఓ కటకం సజన, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి, యారవ శ్రీనివాసులు, కొండిశెట్టి రమణయ్య, ఏఓ వాణి, శ్రీను, షేక్.నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పాఠశాల హెచ్‌యం షేక్.ఖాదరున్నీసాబేగం అధ్యక్షతన జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమంలో తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి ఎంఈఓలు జగన్నాథం ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, కేజీబీవీ ఎస్‌ఓ షేక్.రేష్మ పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్ర ఎదుగుదలే లక్ష్యం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

కొండపి: విద్యార్థుల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల అభిప్రాయాలు తీసుకొని మెనూలోనూ అవసరమైతే మార్పులు చేస్తామన్నారు. ఈసందర్భంగా తల్లిదండ్రులు పలు సమస్యలను మంత్రికి దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా వారిని కనీసం డిగ్రీ వరకైనా చదివిస్తే వారి కాళ్లపై వారు నిలబడతారన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, కలెక్టర్ భోజనం చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కో ఆర్డినేటర్ డి. జయ, సీఐ సోమశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, డిఎంహెచ్వో పద్మజ, నోడల్ ఆఫీసర్ భగీరథీ, ఎంపీడీఓ రామాంజనేయులు, తహసీల్దార్ మురళి, విద్యాశాఖ అధికారులు సురేఖ,రామారావు పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులకు వివరించారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

మర్రిపూడి: మండలంలోని కాకర్ల, గార్లపేట, మర్రిపూడి పాఠశాలల్లో మెగా టీచర్స్ పేరెంట్స్ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతర్ మర్రిపూడి హైస్కూల్‌లో వాటర్‌ప్లాంట్ మూలనపడటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సొంత నిధులతో మరమ్మతులు చేసి తాగునీరు అందిస్తామన్నారు. తహసీల్దార్ జ్వాలా నరసింహారావు, ఎంపీడీఓ జగదీష్, సర్పంచ్ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందజేశారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు, ఎంఈఓ చెంచు పున్నయ్య, ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ శనివారం ఆదాయం రూ.7,81,388

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న శ్రీ మాల్యాద్రి ఎ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆదాయం శనివారం రూ.7,81,388 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాగర్ బాబు తెలిపారు. కుంకుమార్చన రూ.21,960, తలనీలాలు రూ.30,450, ప్రత్యేక దర్శనం రూ.2,21,100, లడ్డూ ప్రసాదాలు రూ.2,06,745, అన్నదానం రూ.2,19,587, రూమ్ అద్దెలు రూ.32,410 వచ్చినట్లు తెలిపారు. ఆలయ అధికారులు పర్యవేక్షణలో జరిగింది.

సమాచారం లేకుండా సదస్సు వాయిదా

- కార్యాలయం వద్ద పడిగాపులు కాసిన రైతులు



మిట్టపాలెంలో అర్జీలతో కార్యాలయం ఎదుట ఎదురుచూస్తున్న రైతులు

హనుమంతునిపాడు: రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం సద్వినియోగం చేసుకోండని అధికారుల ప్రకటనలకు రైతులు కార్యాలయాలకు భారీగా తరలివచ్చారు. కానీ కార్యాలయాల వద్ద ఒక్కరూ కనిపించలేదు. రోజంతా కార్యాలయం వద్ద పడిగాపులు కాసినా ఒక్కరూ పట్టించుకోలేదని రైతులు వాపోయారు. మిట్టపాలెంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో రైతులు పనులు మానుకొని భూ సమస్యలపై అర్జీలు తయారు చేసుకొని రెవిన్యూ అధికారుల కోసం ఎదురుచూశారు. వాస్తవానికి రెవెన్యూ సదస్సు వాయిదా వేశారు. కానీ విషయాన్ని వీఆర్‌ఓ గానీ, ఇతర అధికారులు గానీ సమాచారం ఇవ్వలేదు. దీంతో కార్యాలయానికి వచ్చిన రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎదురుచూసి అధికారుల తీరుపై ఆగ్రహంవ్యక్తం చేశారు. సదస్సు వాయిదా వేస్తే కనీసం సమాచారం ఇవ్వాలని కదా అని ప్రశ్నించారు.

15 లోగా పంటల బీమా చెల్లించాలి



చింతపూడు వద్ద వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ



వెంకటాపురంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

సీఎస్‌పురం(పామూరు): పంటలు సాగుచేసిన రైతులు విధిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో నగదు చెల్లించి నమోదు చేసుకోవాలని ఏఓ. బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని చింతపూడు, కంభంపాడు గ్రామాల్లో శనివారం ఆయన వరి, పప్పుశనగ, జొన్న, మినుము పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వరికి నెలఖారు వరకు, మిగిలిన పంటలకు ఈనెల 15 వరకు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించి పంటల నమోదుకు అవకాశం ఉందన్నారు.

పామూరు: కందిని ఆశించే మారుకా మచ్చల పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి కంచం రాధ పేర్కొన్నారు. మండలంలోని దూబగుంట్ల రైతుసేవా కేంద్రం పరిధిలోని వెంకటాపురంలో శనివారం కందిపైరును పరిశీలించారు. కందిపైరును ఆశించి నష్టపరిచే మారుకా మచ్చల పురుగు జీవితచక్రం గురించి వివరించి, దీన్ని నివారించేందుకు తగిన సలహాలు సూచనలు ఇచ్చి 90 శాతం రాయితీపై లింగాకర్షక బుట్టలను రైతులకు అందజేశారు. ఏఈఓ పి.నాగేష్, వీఏఏ బి.అవినాష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సిబ్బందితో డ్రిల్ నిర్వహిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: కొండపి సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది ప్రతి శనివారం నిర్వహించే గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో సిబ్బంది డ్యూటీ పరంగా ఉన్న ఇబ్బందులను, కుటుంబపరంగా ఉన్న సమస్యలను, ఆరోగ్యపర సమస్యలను గురించి సమాచారం ఇవ్వవచ్చన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్క సిబ్బంది ఆరోగ్యంగా ఉండి, విధులు సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. ముందుగా సిబ్బందితో డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు, పొన్నలూరు ఎస్సై అనూక్, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్ర గాయాలు , ఏడుగురికి స్వల్ప గాయాలు



క్షతగాత్రుడు దేవదానం

పామూరు: ముందుపోతున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఆటోలోని ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మండలంలోని గోపాలపురం వద్ద 565 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మండలంలోని సోమన్నపల్లి గ్రామానికి చెందిన గంధం దేవదానం ఆటోలో పామూరుకు వస్తున్నాడు. ఈసందర్భంలో గోపాలపురం వద్దకు ఆటోరాగానే వెనుకనుండి వేగంగా వస్తున్న కారు ముదుపోతున్న కారును బలంగా ఢీకొట్టింది. ఘటనలో ఆటో బోల్తా పడగా అందులోని గంధం దేవదానంకు కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు మొత్తం ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు దేవదానంను 108లో పామూరు తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు తరలించారు. ఘటనలో ఆటో నుజ్జువగా కారు ముందుభాగం దెబ్బతింది.



ఘటనా స్థలంలో దెబ్బతిన్న ఆటో, కారు

రిటైర్డు ఉపాధ్యాయురాలు నేత్రదానం



కళ్లను సేకరిస్తున్న వైద్యులు

కందుకూరు: పట్టణానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయురాలు నవనీతమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆమె కళ్లను దానం చేశారు. ఈ మేరకు సక్షం శాఖకు చెందిన డాక్టర్‌లు నవనీతమ్మ కళ్లను సేకరించారు. నవనీతమ్మ ఉపాధ్యాయురాలిగా ఈ ప్రాంతంలో మంచి పేరు ప్రతిష్టలున్నాయి. వేలాది మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలిగా ప్రసిద్ధిగాంచారు. రిటైర్డు అనంతరం ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇస్తూ ఎంతో మందికి ఆదర్శవంతంగా నిలిచారు. ఈ క్రమంలో ఆమె మృతిపట్ల ఆమె శిష్యులు, బంధువులు, కుటుంబ సభ్యులు, ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. మరణానంతరం కూడా కళ్లను దానం చేసి ఆమె గొప్పదనాన్ని చాటుకున్నారని కొనియాడారు.